
రహదారిద్య్రం!

- అధ్వానంగా ఎన్ఎస్‌పీ కుడికాలువ కట్ట రోడ్డు
- బురదకయ్యగా మారిన రహదారిపై అదుపు తప్పుతున్న వాహనాలు
- కాలువ కట్టకు ఇరువైపులా కంపచెట్లు

బొల్లాపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని మూగచింతలపాలెం గ్రామ పరిధిలోని నాగార్జున సాగర్ కుడికాలువ కట్ట రహదారి అధ్వానంగా మారింది. రెండు వైపులా కంపచెట్లు మొలచి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నామని రైతులు, ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారి పరిధిలో సుమారు ఐదారు కిలోమీటర్ల వరకు మండలానికి సంబంధించిన రైతుల పొలాలు ఉన్నాయి. అదేవిధంగా ఈపూరు మండలానికి వెళ్లడానికి దగ్గర దారి కావడంతో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి గుండా పొలాలకు వెళ్లేందుకు రైతులు వర్షాకాలంలో అవస్థలు పడుతున్నామని, కట్టకు ఇరువైపులా కంపచెట్లు మొలచి రాకపోకలు సాగించాలంటే అసౌకర్యంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కాలువకట్టకు ఇరువైపులా ఉన్న కంప చెట్లు


బురదకయ్యగా మారిన రహదారి

బురదమయం.. కంపచెట్లు

ఇటీవల వరుసగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రహదారి బురదమయంగా మారడంతో పొలాలకు బైక్‌లపై వెళుతున్న రైతులు అదుపుతప్పి పడిపోతున్నారు. దీంతో పాటు ఈ రహదారి బొల్లాపల్లి, ఈపూరు మండలాలను కలుపుతూ ఉండటం దూరాన్ని తగ్గిస్తుంది. అదేవిధంగా ప్రయాణానికి దగ్గరగా ఉండటంతో రెండు మండలాలకు చెందిన వారు పనుల నిమిత్తం అటూఇటూ వెళ్తుంటారు. రెండు వైపులా కంప చెట్లుమొలచి అధ్వానంగా ఉన్న రహదారిపై రాకపోకలు అసౌకర్యంగా ఉందని అంటున్నారు.

కాల్వ కట్టపై పెద్ద గుంతలు

ప్రధాన కుడికాలువ కావడం కట్టపై మూడు, నాలుగు ప్రదేశాల్లో లోతైన గుంతలు ఏర్పడి కాల్వ కట్ట బలహీన పడే అవకాశం ఉంది. కట్టపై ఏర్పడిన ఈ లోతైన గుంతల నుంచి ఇప్పటికే కాలువ నీరు ఒక వైపుకు చేరుతుందని గుంతలు మరింత లోతుగా ఏర్పడితే కట్ట తెగే ప్రమాదం పొంచిఉందని వాహనదారులు చెబుతున్నారు.

సంబంధిత శాఖల అధికారులు ఈ రహదారిని సందర్శించి, స్పందించి సమస్యను పరిష్కరించాలని, కంప చెట్లను తొలగించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


కాలువకట్టపై ఏర్పడిన పెద్ద గుంత

బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి



కాలువ కట్టను ఆనుకొని మా భూములు ఉన్నాయి. పొలాల సాగుకు రాకపోకలు సాగిస్తుంటాం. బైక్‌పై ఇంట్లోని ఆడవారితో కలిసివచ్చేటప్పుడు అదుపు తప్పడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల పలువురు ద్విచక్రవాహనదారులు స్కిడ్ అవడంతో ప్రమాదాలు జరిగాయి. అధికారులు తక్షణమే స్పందించి రహదారి బాగు చేయాలి.

– చింతా వెంకటేశ్వర్లు, రైతు

క్లుప్తంగా

సాక్షి స్పెల్ బి అభినందనీయం



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులకు ఆంగ్ల భాష పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి సులభతంగా నేర్చుకునేలా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో స్పెల్ బి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని లిటిల్ జెమ్స్ స్కూల్ డైరెక్టర్ లింగా అనంతరామయ్య తెలిపారు. పాఠశాలలో ఇటీవల సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లును మంగళవారం అందచేశారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ అనంతరామయ్య మాట్లాడుతూ తమ విద్యార్థులు రెండవ స్థాయికి ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. స్పెల్ బి వంటి కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌ఛార్జ్ సుష్మ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కోఆర్డినేటర్ షర్మిల పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు గిరిజన గురుకుల విద్యార్థి



వినుకొండ(నూజెండ్ల): ఇటీవల నకరికల్లులో జరిగిన జిల్లా స్థాయి అండర్–17 ఖోఖో బాలుర పోటీల్లో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎం. రాజశేఖర్‌నాయక్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు తెలిపారు. అదేవిధంగా గత నెలలో బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు 9వ తరగతి విద్యార్థులు హనుమానాయక్, తేజానాయక్‌లు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వార్డెన్ అనిల్‌కుమార్, పీఈటీ ఫ్రాంక్లిన్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

జాబ్ డ్రైవ్‌లో 26 మంది ఎంపిక



చిలకలూరిపేట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మోడరన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం 68 మంది నిరుద్యోగులు హాజరుకాగా అందులో 26 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ జాబ్ డ్రైవ్‌లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరై ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు, మోడరన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ చేబ్రోలు మహేష్, ప్రిన్సిపాల్ జె సుభాని, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు ఎం రవీంద్ర నాయక్, జె సురేష్, ఎం.వీరాంజనేయులు, ఎ.రమ్య, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్ పాల్గొన్నారు.

విద్యారంగ సంక్షేమానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



నరసరావుపేట ఈస్ట్: జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎల్.చంద్రకళను మంగళవారం ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.విజయసారథి భేటీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓను కోరారు. పాఠశాలల్లో హాజరు శాతం పెంచటంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంలో చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మోహనరావు, తిరుపతిస్వామి ఉన్నారు.

బొల్లాపల్లి మండల విస్తరణ అధికారి సస్పెన్షన్

బొల్లాపల్లి: విధి నిర్వహణలో అలసత్వం వహించిన బొల్లాపల్లి పంచాయతీ విస్తరణ అధికారి ఎస్కే జిలానీ బాషాను కలెక్టర్ అరుణ్ కుమార్ సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారి చేశారు. ఇటీవల ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పీఆర్ -1 యాప్‌లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన వివరాలు నమోదు చేయలేదనే కారణంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

బాక్సింగ్ పోటీలకు ఏఎంజీ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి

చిలకలూరిపేట: ప్రముఖ స్వచ్ఛంధ సంస్థ ఏఎంజీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో ఈనెల 27 నుంచి 29 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఏఎంజీ హైస్కూల్ విద్యార్థులు బాలుర విభాగంలో కాకి అభిషేక్, బాలికల విభాగంలో బత్తుల అమృతమయి విశేష ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరు త్వరలో ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారు. వీరితో రాష్ట్ర స్థాయి పోటీల్లో పి.గోపి, సింధు, రజిని, హేమ, సాధన క్యాంస పతకాలు సాధించారు. ఈ విద్యార్థులకు స్కూల్ ప్రాంగణంలో మంగళవారం ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి అభినందన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ


విద్యార్థులకు స్కాలర్‌షిప్ నగదు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: మండవ సీతారామాంజనేయులు జయశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 80 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున మండవ సీతారామాంజనేయులు అందచేసారు. శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు దోగిపర్తి విజయకుమార్, పసుమర్తి శివనాగేశ్వరరావు, గాయత్రి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత వేమారెడ్డికి కన్నీటి వీడ్కోలు


వేమారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పార్థీవ దేహాన్ని మోస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ యువనేత, యు వి ఫ్రీకాస్ట్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ యజమాని దుగ్గెంపూడి వేమారెడ్డి(35) అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం వందలాది మంది బంధువులు, మిత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తల అశ్రునయనాల మధ్య నిర్వహించారు. గుంటూరు రోడ్డులోని హిందూ శ్మశాన వాటిక స్వర్గపురిలో మృతదేహానికి ఆయన పెద్దకుమారుడు దహన సంస్కారాలు చేశారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లాకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేమారెడ్డి మృతిచెందిన విషయం విదితమే. ఎప్పుడూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరి తలలో నాలుకలా వ్యవహరించే వేమారెడ్డి ఆకస్మిక మృతిపై మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం మృతదేహాన్ని ప్రకాష్‌నగర్‌లోని నివాసానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని డాక్టర్ గోపిరెడ్డి సందర్శించారు. అంతిమయాత్రలో భౌతికకాయాన్ని మోసి స్వర్గపురి వరకు అనుసరించి వచ్చారు. అంతిమయాత్రలో నియోజకవర్గ పార్టీ శ్రేణులు యావత్తు భారీగా పాల్గొని యువనేతకు కన్నీటి వీడ్కోలు పలికారు.

రోటరీ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



నరసరావుపేట రూరల్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వినుకొండరోడ్డులోని రోటరీ బిల్డింగ్‌లో మంగళవారం విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్, వెల్జాన్ ప్రాజెక్ట్ సహకారంతో రూ.1.15 లక్షల విలువైన 23 సైకిళ్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కపిలవాయి రాజేంద్రప్రసాద్, కోశాధికారి కట్టమూరి ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు దూరంగా ఉండటం వలన విద్యార్థినులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో సైకిళ్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో 37 క్లబ్‌ల పరిధిలో మొదటి విడతగా 240మందికి పంపిణీ చేయగా, రెండవ విడతగా 260 మందికి అందజేసినట్లు వివరించారు. రోటరీ డైరెక్టర్లుపి.అచ్యుత్, పులిపాటి రమేష్, రాచకొండ ప్రసాద్, ఎస్కె జిలాని పాల్గొన్నారు.



ఎట్టకేలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

వినుకొండ పట్టణంలోని ప్రధాన సెంటర్లలో రహదారుల దుస్థితిపై ఈ నెల 25వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించిన రహదారులేనా ఇవి అనే కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టారు. ఈ రోడ్ల మరమ్మతుల పనులను స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు.

– వినుకొండ(నూజెండ్ల)

పొట్లం బిజినెస్ యాప్‌పై కేసు నమోదు

- నిర్వాకులు 50 లక్షలు మోసం చేశారంటూ బాధితుడి ఫిర్యాదు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న టూటౌన్ పోలీసులు

నరసరావుపేట టౌన్: పొట్లం బిజినెస్‌లో భాగస్వామ్యం ఇస్తామని నమ్మబలికి రూ.50లక్షలు తీసుకొని మోసం చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ హైమారావు మంగళవారం రాత్రి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన నాగబోతు శ్రీనివాసరావుకు పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన అల్లమంద శ్రీనివాస్, పవన్, బిందుశ్రీ, సంఘం శెట్టి రఘురాంలు పరిచయమై తాము పొట్లం యాప్ పేరిట స్థానిక ఎన్జీవో కాలనీలో బిజినెస్ ప్రారంభించామని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఫుడ్, నిత్యవసరాలు డోర్ డెలివరీ చేస్తామని చెప్పారు. ఏడాదికి రూ.50 కోట్ల టర్నోవర్ అవుతుందని, తమ వ్యాపారంలో పెట్టుబడిపెడితే భాగస్వామ్యం ఇస్తామని నమ్మ బలికారు. దీంతో శ్రీనివాసరావు రెండు విడతల వారీగా రూ.50 లక్షలు పొట్లం యాప్ అకౌంట్‌కు జమ చేశారు. నెలలు గడుస్తున్నా రూపాయి కూడా తిరిగి ఇవ్వలేదు. వ్యాపారంలో లెక్కలు కూడా చూపించలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నట్టల నివారణ మందును సద్వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న పి.రామారావు

శావల్యాపురం: పశు సంవర్ధకశాఖ వారి సారథ్యంలో గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నట్లు నరసరావుపేట డివిజన్ పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు పి.రామారావు అన్నారు. మంగళవారం స్థానిక పశువైద్యశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవాల్లో నట్టల నివారణ మందు ఉచితంగా మంజూరు చేసిందని ఈ మందును తాగించటం ద్వారా ఆరోగ్యంగాను ఎదుగుదలకు తోడ్పతాయన్నారు. 6 లక్షల 50 వేల జీవాలు ఉండగా ఇప్పటి వరకు 6 లక్షల వరకు నట్టల నివారణ మందును జీవాలకు అందజేశామన్నారు. ఈ నెల 31వ నట్టల నివారణ మందు తుది గడవన్నారు. జీవా లు కల్గియున్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 25 నుంచి జాతీయ స్థాయిలో జరగాల్సిన పశు గణన సర్వే కార్యక్రమం అనివార్య కారణాలు వాయిదా పడిందని నవంబరు మొదట వారం నుంచి ప్రారంభం అవుతుందన్నారు. పశుగణన సర్వే కార్యక్రమంలో పాడి రైతులు అందరు తమవంతు సహకారం అందించాలన్నారు. ఆయనతో పాటు పశుసంవర్ధక శాఖాధికారి రామచంద్రరావు, వైద్యాధికారి సోముల గుణధీర్ ఉన్నారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ విద్యార్థులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్

నరసరావుపేట రూరల్: జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికై నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా నున్న ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటినట్టు తెలిపారు. అండర్–19 బాలుర 20కి.మీ మాస్‌స్టార్ట్ విభాగంలో జేడీ ప్రసన్నకుమార్ ప్రథమ స్థానం, అండర్–17 బాలుర 10 కి.మీ టైం ట్రైల్స్ విభాగంలో ఎం.శశికుమార్ ద్వితీయస్థానం, అండర్–17 బాలికల ట్రిస్ ప్రైస్ విభాగంలో కె.బిందుపూర్ణిమ ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయ్యారని తెలిపారు. వీరు బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం ఉదయం 11.30 నుంచి 12.30 వరకు ఒక గంటపాటు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జీవీఎస్ఎస్ రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరసరావుపేట పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నరసరావుపేట: స్థానిక లింగంగుంట్ల కాలనీలోని ఎన్ఎస్పీ కాలువ వద్దగల శివాలయ పరిసర ప్రాంతాల్లో కాలువలోని పూడిక తీయటం, పిచ్చిమొక్కలను తొలగించటం లాంటి పనులను ఆదివారం మున్సిపల్ అధికారులు నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. మరికొద్దిరోజుల్లో కార్తీకమాసం ప్రవేశిస్తుండటంతో భక్తులు, అయ్యప్ప స్వాములు ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున కాలువను శుభ్రం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ సూచనల మేరకు కమిషనర్ జస్వంతరావు మున్సిపల్ సిబ్బందిచే పనులు నిర్వహించారు. శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

నరసరావుపేటటౌన్: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ మంగళవారం తెలిపారు. స్థానిక శ్రీరాంపురంకు చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికను ఈ నెల 22వ తేదీన బొల్లాపల్లి మండలం మల్లెపల్లి తండాకు చెందిన రమావత్ వెంకటేశ్వరనాయక్ కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. ఈ మేరకు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ షేక్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో వినుకొండలోని పలు వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీల తదితర పనులకు సంబంధించిన అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున సమావేశానికి వైస్ చైర్‌పర్సన్‌లు, వార్డు మెంబర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ఎక్స్ అఫిషియో మెంబర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఉచిత గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దారు కె.సుజాత

శావల్యాపురం: అర్హత కల్గియున్న లబ్ధిదారులందరూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కె.సుజాత అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యాస్ కనెక్షనుతో పాటు తెల్లరేషను కార్డుదారులు అర్హత పొందుతారన్నారు. గ్యాస్ కనెక్షన్, రేషన్ ఆధార్ కార్డు ఉన్న వారందరూ గ్యాస్ కార్యాలయంలో ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు దఫాలు వారీగా ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసుకున్న గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులు నగదు చెల్లింపులు చేసిన రెండు రోజుల వ్యవధిలో వారి బ్యాంకు ఖాతాలోకి నగదు జమ చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టభద్రుల కల్గియున్న సమగ్ర సమాచారంతో తమ ఓటు హక్కు కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే విచారణ చేసి అర్హత కల్గియుంటే ఓటు హక్కు కల్పిస్తామన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పేరిపోముల నాసరయ్య తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఏరియా జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే సెమిష్టర్ పరీక్షలు రాయనిస్తామని, లేకుంటే హాల్ టికెట్లు ఇవ్వమని బెదిరింపులకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేరును తల్లికి వందనం అని పేరు మార్చిన కూటమి ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నగదు మాత్రం జమచేయడం లేదని విమర్శించారు. మరో వైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేయడమే లక్ష్యంగా కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ ఏరియా అధ్యక్షుడు సాయినాయక్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, నాయకులు ఆరాధ్యుల రామకృష్ణ, బొంతా భగత్‌సింగ్, తన్నారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

